కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న ఆందోళన కారులు

జిల్లాకు అన్యాయం...

- ఊసే లేని కొత్త ప్రాజెక్టులు
- ఉమ్మడి జిల్లాకు అరకొరగానే కేటాయింపులు
- జిల్లా వాసుల నుంచి వ్యక్తమవుతున్న అసంతృప్తి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సోమవారం రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. 2024-25 సంవత్సరానికి సంబంధించి రూ.2.94 లక్షల కోట్ల ప్రతిపాదనతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌కు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలుపగా సోమవారం ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రూ.43,402.33 కోట్లతో వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రాష్ట్ర బడ్జెట్ రెవెన్యూ వ్యయం అంచనా రూ.2.34 లక్షల కోట్లుగా, మూలధన వ్యయం అంచనా రూ.32,712 కోట్లుగా, రెవెన్యూ లోటు రూ.34,743 కోట్లుగా పేర్కొన్నారు. ద్రవ్యలోటు రూ.68,743 కోట్లుగా, జిఎస్‌డిపిలో రెవెన్యూ లోటు అంచనా 4.19 శాతంగా, ద్రవ్య లోటు అంచనా 2.12 శాతంగా పేర్కొన్నారు.

అంకెల్లో కేటాయింపులు ఇలా (కోట్లలో)...

విషయం	గతేడాది కేటాయింపు	ఖర్చు చేసింది	ప్రస్తుత కేటాయింపు
శ్రీశైలం ప్రాజెక్టు	24.12	21.27	26.30
కెసి కెనాల్	225.22	54.08	253.24
ఎస్ఆర్‌బిసి	42.75	15.15	48.42
హెచ్ఎన్ఎస్ఎస్	122.69	339.16	1867.75
గురు రాఘవేంద్ర	24.64	82.93	69.06
క్లస్టర్ యూనివర్సిటీ	1.20	0.73	1.40
ఆర్‌యు	8.64	5.68	10.45
ఉర్దూ యూనివర్సిటీ	--	--	1.50

రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు అన్యాయం జరిగింది. కొత్త ప్రాజెక్టుల ఊసే లేదు. కర్నూలు జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీలిస్తున్నా బడ్జెట్‌లో మాత్రం కేటాయింపులు చేయలేదు. గుండ్రేవుల, వేదవతి, ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మాణాలకు ఎలాంటి నిధులు కేటాయించలేదు. కర్నూలు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు మొత్తం 561.94 కోట్లను కేటాయించారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ కోసం రూ.26.30 కోట్లు, కెసి కెనాల్‌కు రూ.253.24 కోట్లు, ఎస్ఆర్‌బిసికి రూ.48.42 కోట్లు, గురు రాఘవేంద్ర ప్రాజెక్టు కోసం రూ.69.06 కోట్లు, హంద్రీనీవా సుజల స్రవంతి కోసం రూ.1867.75 కోట్లు కేటాయించారు. రాజమండ్రి, ఏలూరు, నంద్యాల వైద్య కళాశాలలకు రూ.221.81 కోట్లు కేటాయించగా నిర్మాణంలో ఉన్న ఆదోని వైద్య కళాశాల గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. విద్యా రంగానికి సంబంధించిన కేటాయింపుల్లో క్లస్టర్ యూనివర్సిటీకి రూ.1.40 కోట్లు, రాయలసీమ యూనివర్సిటీకి రూ.10.45 కోట్లు, అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీకి రూ.1.50 కోట్లను కేటాయిస్తున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. జిల్లాకు బడ్జెట్‌లో అరకొర కేటాయింపులే చేయడం పట్ల జిల్లా వాసుల నుంచి అసంతృప్తి వ్యక్తం అవుతోంది.

ప్రజలకు నిరాశ కలిగించింది

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ జల వనరుల శాఖకు రూ.16, 705 కోట్లు కేటాయించినప్పటికీ కర్నూలు జిల్లాలోని వేదవతి, గుండ్రేవుల, ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మాణానికి నిధులు కేటాయింపులు లేకపోవడం బాధాకరం. నిధులు కేటాయింపులు లేకపోవడం జిల్లాలో పశ్చిమ ప్రాంతం మరింత వెనుకబాటుకు కరువు కాటకాలకు నిలయంగా మారే ప్రమాదముంది. బడ్జెట్లో సవరణలు చేసి స్పష్టంగా నిధులు కేటాయింపులు చేయాలి. సూపర్ సిక్స్‌లో భాగమైన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, 18 నుంచి 60 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500 ఖాతాలకు జమ చేస్తామని హామీ ఇచ్చారు. వాటికి ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేయకపోవడం ప్రజలకు నిరాశ కలిగించింది.

- బి.గిడ్డయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి.

ఎన్నికల హామీలపై స్పష్టతలేని బడ్జెట్

కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీలను ఎప్పటి నుండి అమలు చేస్తారో బడ్జెట్‌లో కనీస ప్రస్తావన చేయకపోవడం ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. రాష్ట్ర ప్రజలకు నిర్దిష్టంగా కలిగే ప్రయోజనాల గురించి ప్రస్తావనే లేదు. బడ్జెట్ పూర్తి రాజకీయ పత్రంగా ఉంది. వెనుకబడిన ప్రాంతాల్లో అభివృద్ధి గురించి గాని, కర్నూలు జిల్లా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం గురించి గానీ ప్రస్తావన లేకపోవడం కర్నూలు జిల్లా ప్రజలను మోసం చేయడమే. దళితులకు, మహిళలు, మైనార్టీల సంక్షేమానికి నామమాత్రంగా నిధులు కేటాయించడం వారి సంక్షేమ పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏదో స్పష్టమైంది. తల్లికి వందనం వంటివి ఎప్పుడు అమలు చేస్తారో చెప్పకపోవడం ఆయా తరగతులకు తీవ్ర నిరాశ కలిగిస్తోంది. ఉచిత బీమా ఇకపై రైతు ప్రీమియం చెల్లిస్తేనే అమలవుతుందన్న విషయాన్ని దాచిపెట్టడం అన్నదాతను మభ్యపుచ్చడమే. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామన్నా వాగ్దానాన్ని ఈ బడ్జెట్లో ప్రస్తావించలేదు. గత ప్రభుత్వంపై విమర్శలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు.

- డి.గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి

ప్రజల నమ్మకాన్ని ప్రతిబింబించే బడ్జెట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని ప్రతిబింబించేలా ఉంది. వ్యవసాయం పరిశ్రమలను ప్రాధాన్యతగా అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ప్రజలు ప్రభుత్వంపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని సామాజిక తరగతులను సంతృప్తిపరిచేలా నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేస్తూ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా పరిశ్రమల రంగానికి పెద్ద పీఠవేసింది. ఈ బడ్జెట్ రాష్ట్ర ప్రజలకు శుభపరిణామం.

- సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.

ప్రజలకు ఒరిగిందేమీ లేదు

రాష్ట్రంలోని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నుంచి ప్రజలకు ఒరిగిందేమీ లేదు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. అంకెల గారడి బడ్జెట్ తప్ప ప్రజలకు ఉపయోగకరంగా ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదు.

- పి.మురళీకృష్ణ, డిసిసి అధ్యక్షులు

యురేనియం అన్వేషణ ఆపాలి

- కలెక్టరేట్‌ను ముట్టడించిన గ్రామస్తుల
- కలెక్టర్ వచ్చే వరకు కదిలేదిలేదు : ఆందోళన కారులు
- జెసి హామీతో ఆందోళన విరమణ
- చంద్రబాబు పవన్ కళ్యాణ్ ప్రకటన చేయాలి
- ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కప్పట్రాళ్ల తదితర గ్రామాల పరిధిలోని ఫారెస్టు భూమిలో యురేనియం తవ్వకాల అన్వేషణ ఆపాలని కోరుతూ యురేనియం తవ్వకాల వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం కర్నూలు కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సిఐటియు, మహిళ, ప్రజా సంఘాలు నాయకులు ఆందోళనకు మద్దతు తెలిపారు. కర్నూలు సుందరయ్య సర్కిల్ నుండి కలెక్టరేట్ వరకు యురేనియన్ తవ్వకాలకు అన్వేషణ ఆపాలంటూ ప్రదర్శన చేశారు. కలెక్టరేట్ గేటు ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. జిల్లా కలెక్టర్ వచ్చి ప్రకటన చేస్తే తప్ప ఇక్కడి నుంచి వెళ్లేది లేదని బైఠాయించారు. వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి పోలీసులు తీసుకువెళ్లారు. అక్కడికి డిఆర్‌ఒ వెంకటనారాయణమ్మ, జిల్లా అటవీశాఖ అధికారిని పంపించినా ఆందోళనకారులు శాంతించలేదు. కలెక్టర్ వచ్చి ప్రకటన చేసేంతవరకు ఇక్కడి నుండి వెళ్ళేది లేదని భీష్మించి కూర్చున్నారు. ఎంతసేపటికి కలెక్టర్ నుండి స్పందన రాకపోవడంతో కలెక్టరేట్ గేట్లను ఎక్కి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని నిలువరించారు. కొంతసేపు పోలీసులకు ఆందోళనకారుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అక్కడికి చేరుకొని యురేనియం తవ్వకాలపై స్పష్టమైన ప్రకటన చేశారు. యురేనియం తవ్వకాలు చేపట్టాలంటే ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తామని చెప్పారు. అక్కడ అలాంటిదేమీ నిర్వహించడం లేదని, అలాంటప్పుడు తవ్వకాలు ఎలా జరుగుతాయని అన్నారు. దేవనకొండ మండలపరిధిలో యురేనియం తవ్వకాలను చేపట్టడం లేదని ఆమె ప్రకటించడంతో వెంటనే ఆందోళన విరమించి వెళ్లారు. అంతకు ముందు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్ అధ్యక్షతన జరిగిన ముట్టడి కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, సిఐటియు జిల్లా అధ్యక్షుడు పిఎస్. రాధాకృష్ణ, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల మాట్లాడారు. యురేనియం తవ్వకాల వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అనారోగ్యానికి గురవుతారన్నారు. గత ప్రభుత్వ హయాంలో తవ్వకాలకు అనుమతులు ఇస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా అనుమతించడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం అండతో సాగుతున్న తవ్వకాలను నిలిపివేయాలని ప్రజలు గత పది రోజులుగా ఆందోళన చేపడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. యురేనియం తవ్వకాల వల్ల ఈ ప్రాంతం కాలుష్యం బారిన పడడమే కాకుండా వ్యవసాయ భూములు సాగుకు పనికిరాకుండా పోతాయన్నారు. కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి చర్యలు తీసుకుంటున్నాయని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జోక్యం చేసుకొని యురేనియం తవ్వకాలను నిలిపివేస్తూ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఈ ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

జెసి బినవ్యకు వినతిపత్రం ఇచ్చిన అనంతరం మాట్లాడుతున్న రైతుసంఘం జిలా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

కర్నూలు, పెద్దపాడు రోడ్డును పరిశీలించిన ఎస్ఇ

- పిపిఎస్ఎస్ వినతికి స్పందించిన కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పట్టణ పౌర సంక్షేమ సంఘం(పిపిఎస్ఎస్) ఫిర్యాదు మేరకు కలెక్టర్ స్పందించారు. దీంతో నాణ్యత లేకుండా వేసిన కర్నూలు పెద్దపాడు రోడ్డును ఆర్అండ్‌బి ఎస్ఇ మహేశ్వర్‌రెడ్డి, డిఇ, ఎఇ పరిశీలించారు. రోడ్డు పునఃనిర్మాణానికి అంగీకరించారు. రూ.కోట్లు ఖర్చుపెట్టి వేసిన కర్నూలు పెద్దపాడు మధ్య రోడ్డు పనులు పూర్తికాకముందే శిథిలమై గుంతలు పడడంతో మరమ్మతులు చేశారు. ఈ మరమ్మతుల వల్ల కొత్తగా వేసిన రోడ్డు అతుకుల బొంతలా తయారైంది. గతంలో రహదారుల శాఖ సూపరిన్‌టెండెంట్‌కు తెలిపినా స్పందించలేదు. ఈ విషయాన్ని ఫోటోలతో సహా సోమవారం కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పిపిఎస్ఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రహదారుల శాఖ ఎస్ఇ పి.మహేశ్వర్ రెడ్డి, డిప్యూటీ ఇంజనీర్లు అసిస్టెంట్ ఇంజనీర్లు పెద్దపాడు రోడ్డును పిపిఎస్ఎస్ ప్రతినిధి బృందం సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఇ మాట్లాడుతూ టెక్నికల్ ప్రాబ్లంవల్ల తారుకంకర కలపడంలో రోడ్డువేసినప్పు కొన్ని లోపాలు జరిగాయన్నారు. శిథిలమైన రోడ్డు మొత్తం రెండవసారి వేయిస్తామని, గతంలో వేసిన రోడ్డుకు కాంట్రాక్టరుకు ఒక్క రూపాయి కూడా బిల్లు చెల్లించే ప్రసక్తే లేదన్నారు. ఈ రోడ్డును నిబంధనల ప్రకారం పునర్నిర్మిస్తామని హామీ ఇచ్చారు. రోడ్డు పరిశీలనలో పిపిఎస్ఎస్ రాష్ట్ర నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, నాయకులు ఎండి. యూనిస్, ఎస్.రమణ గౌడ్, స్థానిక కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు ఎన్. పీటర్, కె.వెంకట్‌నర్సు, డి. ప్రభాకర్ రెడ్డితదితరులు పాల్గొన్నారు.

రోడ్డును పరిశీలిస్తున్న ఎస్ఇ, డిఇలు , పిపిఎస్ఎస్ నాయకులు

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత : కలెక్టర్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల పరిష్కారాలపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. వెబ్‌సైట్‌లో వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని ఆదేశించామన్నారు. అయినప్పటికీ ఇంకా 12 అర్జీలను అధికారులు చూడలేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. డిఎస్‌డిఒ ఎయిడ్స్ నియంత్రణ అధికారి, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, పత్తికొండ లాగిన్ల లో ఏడు రోజుల కింద అర్జీలు వచ్చాయన్నారు. వాటిని ఓపెన్ చేసిచూడలేదని, ప్రతి సారి గుర్తు చెయ్యాలా అని కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డిఆర్‌ఒ సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కొండయ్య, చిరంజీవి, నాగ ప్రసన్నలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా రవికుమార్, నవీన్ పాటి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నవీన్‌పాటి - రవికుమార్

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) కర్నూలు జిల్లా నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్‌పాటి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శని,ఆదివారాల్లో గూడూరులో నిర్వహించిన యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభల్లో కర్నూలు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా రవికుమార్ నవీన్ పాటి జిల్లా ఆర్థిక కార్యదర్శిగా యెహోషువ, జిల్లా సహాధ్యక్షులుగా హేమంత్ కుమార్, జీవిత, జిల్లా గౌరవ అధ్యక్షుడిగా దావీదు, జిల్లా కార్యదర్శులుగా.తిమ్మన్న, ఇబ్రహీం, భాస్కర్, గాదలింగప్ప, వెంకటేష్, లక్ష్మీదేవి, దుర్గాప్రసాద్, సురేష్ బాబు, జి.బాబ, కౌలన్న చంద్రకళ , జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా శ్రీనివాసులు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిలర్లుగా నాగమణి, ఎల్లప్ప , కాశీం, సుధాకర్‌లు ఎన్నికయ్యారు. సాంస్కృతిక కమిటీ కన్వీనర్ హనుమన్న, ఐక్య ఉపాధ్యాయ పత్రిక కన్వీనర్ చంద్రపాల్, మహిళా విభాగం కన్వీనర్‌గా విజయలక్ష్మి, జిల్లా అకడమిక్ విభాగం కన్వీనర్, నరసయ్య గౌడులను ఎన్నుకున్నారు.

కర్నూలు నగర ప్రజల వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

శివారు కాలనీలకు మౌలిక వసతులు కల్పిస్తాం

-కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు-ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 18 అర్జీలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరంలోని శివారు కాలనీల్లో మౌలిక వసతుల కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 18 అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, మేనేజర్ ఎన్.చిన్నరాముడు, ఆరోగ్యధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంఇ. సత్యనారాయణ, ఆర్‌ఒ జునైద్, టిపిఆర్‌ఒ వెంకటలక్ష్మి, సోషల్ డెవలప్మెంట్ స్పెషలిస్ట్ (టిడ్కో) అధికారి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మౌలాన అబుల్ కలాం జయంతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అబుల్ కలాం అజాద్‌కు నివాళి అర్పిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, జెసి బి.నవ్య

కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మైనారిటీ సంక్షేమ దినోత్సవంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలందరూ అటువంటి గొప్ప వ్యక్తిని స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. ఇప్పటికే రూ.50 కోట్లతో పలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందచేశారు. కార్యక్రమంలో, మైనార్టీ సంక్షేమ అధికారి సబీహా పర్వీన్, ఎపిఎస్‌పి బెటాలియన్ డిఎస్‌పి మహబూబ్ బాష, మైనార్టీ సంక్షేమ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యాదినోత్సవం

అబుల్ కలా అజాద్ చూపిన మార్గంలోనే మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా ప్రమాణాలను రూపొందించాలని ఉర్దూ యూనివర్సిటీ ఇంచార్జి మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.నరసింహులు అన్నారు. డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో జాతీయ విద్యా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీలో ఆన్ లైన్ ద్వారా రెండు ఉపన్యాసాలను నిర్వహించారు. మొదటి ఉపన్యాసం మాజీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ వై.నరసింహులు 'ఉన్నత విద్యా , సమాజం' భారతీయ భాషా సమితి అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఫణికృష్ణ 'భిన్నత్వంలో ఏకత్వం- భారతీయ భాషల కోసం జాతీయ విద్యా విధానం దృష్టి' అంశాలపై సెమినార్ నిర్వహించారు. యూనివర్సిటీ ఇంచార్జి వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ పిఎస్ షావలిఖాన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ్, ఇంచార్జి ప్రిన్సిపల్ డాక్టర్ మహబూబ్ బాష, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగా అభివృద్ధికి అబుల్ కలాం కృషి

విద్యారంగ అభివృద్ధికి కృషిచేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని ఉస్మానియా కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ సమీవుద్దిన్ ముజమ్మిల్ అన్నారు. ఉస్మానియా కళాశాలలో 'జాతీయ విద్యా దినోత్సవం' 'మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. సయ్యద్ సమీరుద్దీన్ ముజామిల్ మాట్లాడుతూ అనేక సంస్కరణలు విద్యాభివృద్ధికి అబుల్ కలాం సూచనలు దోహదం చేశాయని అన్నారు. తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్.మండి అన్వర్ హుస్సేన్, పర్షియన్ శాఖ అధ్యక్షులు హాఫిజ్ అబ్దుల్ వహాబ్, జంతుశాస్త్ర శాఖ అధ్యక్షులు ఎ.ఆబిద్‌అలీ, ఉర్దూ శాఖ అధ్యక్షులు అబ్దుల్ కరీం సాజిద్, అరబిక్ శాఖ అధ్యాపకులు మొహమ్మద్ సుహేల్, కామర్స్ శాఖ అధ్యక్షుడు షేక్ రసూల్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

అబుల్ కలాం సేవలు మరువలేనివి: డిసిసి

మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు భారత జాతి ఎన్నటికీ మరువలేదని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులుపరిగెల మురళీకష్ణ అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ 136 వ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి డిసిసి అధ్యక్షుడు పి మురళీకృష్ణ ఇతర కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు . కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నందు టిబి వార్డులో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు.

ఉస్మానియా కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్



కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో అబుల్ కలాంకు నివాళి

14 నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నాన్-కమ్యూనికబుల్ డిసీజెస్ సర్వేలో భాగంగా ఈనెల 14 నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నామని, తద్వారా ముందుగానే క్యాన్సర్‌ను గుర్తించి నివారించుకునే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. నాన్-కమ్యూనికబుల్ డిసీజెస్ 3.0 క్యాన్సర్ స్క్రీనింగ్‌కు సంబంధించిన 'క్యాన్సర్ ను నివారించవచ్చు' పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

లైవ్ హిస్ట్రోస్కోపీ వర్క్‌షాపుకు హాజరయిన ఫాగ్సి సెక్రెటరీ డాక్టర్ రాధాలక్ష్మీ, సిఇఒ డాక్టర్ ఎస్‌వి.చంద్రశేఖర్

జెమ్‌కేర్ కామినేనిలో లైవ్ హిస్ట్రోస్కోపీ వర్క్ షాప్ విజయవంతం

పజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు కొత్త బస్టాండు జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో ఎఫ్‌ఒజిఎస్‌ఐ వాళ్ళ ఆధ్వర్యంలో కెఒజిఎస్, జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్స్ సహాయ సహకారాలతో ఈనెల 10న కర్నూల్‌లోనే తొలిసారి జాతీయస్థాయి లైవ్ హిస్ట్రోస్కోపివర్క్‌షాప్‌ను నిర్వహించామని జెమ్ కేర్ కామినేని హాస్పిటల్స్ సిఇఒ డాక్టర్ ఎస్‌వి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో భారత దేశ నలుమూలల నుంచి ఏడుగురు స్పెషలైజేషన్ చేసిన గైనకాలజిస్ట్ డాక్టర్లు హాజరై 14 హిస్ట్రోస్కోపీ సంబంధించిన సర్జరీలను ఉచితంగా చేశారని తెలిపారు. సర్జరీలు జంకేర్ కామినేని హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ డాక్టర్ వి.శృతి ఆధ్వర్యంలో నిర్వహించారని చెప్పారు. ఈ సర్జరీలను లైవ్‌లో చూడడానికి రాష్ట్ర నలుమూలల నుంచి దాదాపు 200 మంది గైనకాలజిస్టులు, పీజీ చేస్తున్న విద్యార్థులు వచ్చారని, వారికి ఆడిటోరియంలో లైవ్ బ్రాడ్‌కాస్టింగ్ ద్వారా సర్జరీలను చూసే అవకాశాన్ని కల్పించామని డాక్టర్ చంద్రశేఖర్ వివరించారు. ఈ కార్యక్రమానికి ఫాగ్సి సెక్రటరీ డాక్టర్ వి.రాధాలక్ష్మి , ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్. వెంకటరమణ సహాయ సహకారాలు అందించారని తెలిపారు. ఇలాంటి లైవ్ సర్జరీలు జరగడం జమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో ఇది రెండో సారి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్స్ ఎస్ రవిబాబు , డాక్టర్ రామ్మోహన్ , డాక్టర్ బాల మురళీకృష్ణ - లాప్రోస్కోపిక్ సర్జన్ , డాక్టర్ ఆదిత్య -, డాక్టర్ మాధవి -అనస్థీషియా, డాక్టర్ రాఘవేంద్ర - కార్డియాలజిస్ట్ , డాక్టర్ గణేష్ -చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ,నదీమ్ -ఆపరేషన్ హెడ్ ,డాక్టర్ కీన్‌కౌల్ ఎజిఎం, ఆపరేషన్ థియేటర్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని లైవ్‌లో వీక్షించడానికి విచ్చేసిన పీజీ విద్యార్థులు , గైనకాలజిస్టులు సిఇఒ డాక్టర్ చంద్రశేఖర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలి

- కెజిబిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - నందవరం

ఎంపిడిఒకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలని కెజిబిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌డి.ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం బస్టాండ్ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు కెజిబిఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. అనంతరం ఎంపిడిఒ పుల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. చేతివృత్తుల వారు సంఘం జిల్లా కన్వీనర్ సి.గురుశేఖర్ పాల్గొని నిరసనకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కెజిబిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌డి.ఆనంద్ బాబు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవసహాయం, కెజిబిఎస్ మండల కార్యదర్శి నాగలెన్న నరసింహులు మాట్లాడారు. చనిపోయిన వారి అంత్యక్రియలకు శ్మశానంలో గుంతలు తీసి పూడుస్తూ, కట్టెలు పేర్చి కాల్చే వృత్తిని అనాదిగా నిర్వహిస్తున్నారని తెలిపారు. కాటికాపరులను వృత్తిదారులుగా గుర్తించి ఆదుకునే ప్రయత్నం ప్రభుత్వాలు చేయడం లేదని విమర్శించారు. వారి ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ఎలాంటి బీమాను ఇవ్వకపోవడం బాధాకరమని తెలిపారు. కాటికాపరుల సమస్యలను పరిష్కరించి వారి బతుకుల్లో వెలుగు నింపాలని కోరారు. ప్రతి దళిత పేటకు రెండున్నర ఎకరాల శ్మశాన స్థలం కేటాయించి ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. శ్మశానంలో బోరు, షెడ్డు ఏర్పాటు చేసి శ్మశానానికి వెళ్లే రహదారులను నిర్మించాలని కోరారు. కెవిపిఎస్ జిల్లా నాయకులు స్వామిదాసు, ఆంథోని, మండల నాయకులు గురజాల దేవరాజు, చిన్నరాజు, నందవరం దేవరాజు, పూలచింత నరసింహులు, రాయచోటి దేవదాసు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధుల్లోకి తీసుకోవాలి

- వ్యకాస నాయకులు లింగన్న

ప్రజాశక్తి - ఆదోని

నిరసన చేపడుతున్న నాయకులు

అవకతవకలకు అవకాశం లేకుండా విధులు నిర్వహిస్తున్న ఈరమ్మను ఫీల్డ్ అసిస్టెంట్ బాధ్యత నుంచి తొలగించడం సమంజసం కాదని, వెంటనే ఆమెను విధుల్లోకి తీసుకోవాలని వ్యకాస నాయకులు లింగన్న, రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా మండలంలోని పాండవగల్లులో ఈరమ్మ ఫీల్డ్ అసిస్టెంట్‌గా బాధ్యతగా విధులు నిర్వహించేవారని తెలిపారు. అలాంటి ఆమెను పక్కనపెట్టి మరో వ్యక్తికి బాధ్యతలు అప్పజెప్పడం భావ్యం కాదంటూ మండిపడ్డారు. తప్పుడు మస్టర్లు ఇచ్చిన ఎపిఒను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే చాలామంది ఇతర ప్రాంతాలకు పనుల కోసం వలస వెళ్లారని తెలిపారు. పనులు కల్పించకుండా రాజకీయ నాయకులకు తొత్తులుగా మారడం అధికారులకు తగదంటూ పేర్కొన్నారు. ఉపాధి హామీలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కూలీలకు అనుకూలంగా ఉన్న ఈరమ్మకు ఫీల్డ్ అసిస్టెంట్ బాధ్యతలు అప్పజెప్పాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు రామాంజనేయులు, ఉమాదేవి, ఉపాధి కూలీలు ఉన్నారు.

ఉపాధి లేక వలసబాట

- పెద్దకడబూరు నుంచి 100 మంది వలస

ప్రజాశక్తి - పెద్దకడబూరు

గ్రామంలో పనులు లేకపోవడంతో పెద్దకడబూరు నుంచి దాదాపు 100 మంది పిల్లాపాపలతో సోమవారం వలస బాట పట్టారు. పెద్దకడబూరులోని లక్ష్మీపేట నుంచి తెలంగాణలోని వికారాబాద్‌కు పత్తి పంట నూర్పిడి పనులకు రెండు బొలెరో వాహనాల్లో బయల్దేరారు. వర్షాభావ పరిస్థితుల వల్ల ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో పంటలు సరిగా పండలేదు. వర్షాలతో పత్తి పంట అరకొర దిగుబడి రావడంతో వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టాయి. మిరప కోత పనులు కూడా ప్రారంభం కాలేదు. పనులు తగ్గడంతో చేసేదేమిలేక కూలీలు వలస బాట పట్టారు. వలసలు నివారించాల్సిన ఉపాధి హామీ చట్టం పనులు ఎక్కడా ఆదుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

అప్పులు తీరాలంటే వలస తప్పదు

- తెలుగు ముద్దన్న

చేసిన అప్పులు తీరాలంటే కుటుంబంతో వలస వెళ్లక తప్పడం లేదు. వ్యవసాయం చేసేందుకు భూమి లేదు. గ్రామంలో వ్యవసాయ పనులు కూడా తగ్గిపోయాయి. గత్యంతరం లేక బడికి వెళ్లే పిల్లలను కూడా తమతో తీసుకెళ్లే పరిస్థితి ఏర్పడింది.

ఉపాధి పనులు కల్పించి వలసలు నివారించాలి

- కె.పరమేష్, సిపిఎం నాయకులు

వలసలు నివారించేందుకు ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీ చట్టంలో పనులు కల్పించాలి. కనీస వేతనం రూ.500 ఇవ్వాలి.

వలస వెళ్తున్న కూలీలు

కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గుడిసె ఆది కృష్ణమ్మ

విజన్ గల నాయకుడు చంద్రబాబు

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

భావితరాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రాన్ని పురోగతి వైపు నడిపించే విజన్ గల నాయకుడు చంద్రబాబు అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. ఆదోనిలో బార్ పేటకు చెందిన 35 ముస్లిం కుటుంబాలు గుడిసె ఆది కృష్ణమ్మ ఆధ్వర్యంలో ఆమె స్వగృహంలో సోమవారం టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను పేదలు విశ్వసిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో దౌర్జన్యాలు, గుండాయిజం, కబ్జాలతో పేదలు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. సయ్యద్ సాబీర్ అలీ, సయ్యద్ హసేన్ అలీ, సయ్యద్ మహ్మద్, కటికె ఖాజా హుస్సేన్, కటిక ఇమామ్, కటిక ఆర్టీజ్, కటిక సమీర్, షేక్ వహీద్, షేక్ వాజిద్, షేక్ రోషన్, షేక్ శైమల్లా యూసుఫ్, షకీల్ ఖాన్, షేక్ అహ్మద్, షైనుల్లా అల్తాఫ్ ఉసేన్, రోషన్ అల్తాఫ్ ఉసేన్, షేక్ షఫీ ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి : సర్పంచి

ప్రజాశక్తి - నందవరం

గ్రామంలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శి పెద్దరెడ్డిపై చర్యలు తీసుకోవాలని మాచాపురం సర్పంచి పి.కిష్టప్ప తెలిపారు. ఎంపిడిఒ పుల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో తన దృష్టికి తెలపకుండా పంచాయతీ కార్యదర్శి పెద్దరెడ్డి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ పైపులైన్ వేసినట్లు, గ్రామంలో ముళ్లకంపలు తీయడం, సొంతంగా తీర్మానాలు రాసుకుంటూ అవినీతికి పాల్పడుతున్నారని చెప్పారు. వీటి గురించి తాను ప్రశ్నిస్తే 'మీరు చేసిన పనులకు తీర్మానాలు ఇవ్వను' అని బెదిరిస్తున్నారని తెలిపారు. ఇలాంటి అవినీతికి పాల్పడే పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎంపిడిఒకు వినతిపత్రాన్ని అందిస్తున్న సర్పంచి కిష్టప్ప

అభ్యసనంపై అవగాహన

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న నరసన్న

ప్రజాశక్తి - దేవనకొండ

మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం సమాజంలోని అందరికీ జీవితాల అభ్యసనంపై విద్యాశాఖ సూపర్‌వైజర్ రమణయ్య, హెచ్‌డి సిసి నరసన్న అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉల్లాస్ కార్యక్రమం కింద గ్రామంలో చదువురాని మహిళలకు చదవడం, రాయడం, లెక్కలు చేయడం నేర్పించే అంశాల గురించి వాలంటీర్ టీచర్లకు అవగాహన కల్పించారు. ఒక వాలంటీర్ 10 మంది చదువురాని మహిళలకు చదవడం, రాయడం, చిన్న చిన్న లెక్కలు చేయడం, మహిళా చట్టాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ అంశాలన్నీ స్వచ్ఛందంగా నేర్పించాల్సిన బాధ్యత వాలంటీర్లపై ఉంటుందని చెప్పారు. వెలుగు సిబ్బంది సిసిలు, మస్తాన్, ముద్ద రంగడు, సోమన్న, యంగన్న, ప్రభాకర్ పాల్గొన్నారు.

సిబ్బంది కొరతతో సేవల్లో జాప్యం

- తహశీల్దార్ రవి

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరతతో ప్రజలకు అందించే సేవల్లో జాప్యం జరుగుతోందని తహశీల్దార్ ఎస్.రవి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మొత్తం 21 గ్రామాలకు, 20 పంచాయతీలకు విఆర్ఒలు 21 మంది, విలేజ్ సర్వేయర్లు 21 మంది అవసరం ఉండగా కేవలం 11 మంది విఆర్ఒలు ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం 15 మంది గ్రామీణ సర్వేయర్లు ఉండగా అందులో ఇద్దరు డిప్యూటేషన్‌పై వెళ్లినట్లు చెప్పారు. ఉన్న ఒక్క డిప్యూటీ తహశీల్దార్ డిప్యూటేషన్‌పై ఆదోనిలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వాచ్ మేన్ పోస్టు కూడా ఖాళీగా ఉందన్నారు. ఉన్న సిబ్బందికే అదనపు బాధ్యతలు అప్పగించామని, అందువల్ల సేవల్లో జాప్యం జరుగుతోందని తెలిపారు. పూర్తి సిబ్బంది అందుబాటులో ఉంటే పనులు త్వరగా పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందని చెప్పారు.

పిల్లలకు ప్లేట్లు పంపిణీ

ప్లేట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని మేళిగనూర్ గ్రామ అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు భోజనం చేయడానికి టిడిపి నాయకులు, సూర్య యూత్ ఆధ్వర్యంలో ప్లేట్లు పంపిణీ చేశారు. సోమవారం ఈ అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు సరిపడే ప్లేట్లు లేకపోవడంతో గత ప్రభుత్వంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో విద్యార్థుల కోసం ప్లేట్లను అందించినట్లు వారు పేర్కొన్నారు. టిడిపి నాయకులు మానవ దృక్పథంతో పిల్లలకు ప్లేట్లు అందించిన వారికి అంగన్వాడీ టీచర్ కృతజ్ఞతలు తెలిపారు. సూర్య యూత్ సభ్యులు, టిడిపి నాయకులు వెంకోబ, హనుమంతు, రామయ్య, పంపా, ఉలిగయ్య, వెంకటేష్, హనుమంతు, రాము పాల్గొన్నారు.

ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- ఎంపిడిఒ సుబ్బరాజు, ప్రతిభ హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష

ప్రజాశక్తి - కౌతాళం

ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపిడిఒ

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

భారతరత్న, భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎంపిడిఒ సుబ్బరాజు, ప్రతిభ హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష తెలిపారు. సోమవారం ఆజాద్ 136వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి పాఠశాల సెక్రటరీ మైనుద్దీన్, ఇన్‌ఛార్జి జయలక్ష్మి, రాజు, సీనియర్ ఉపాధ్యాయులు ఈరన్న, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఎంపిడిఒ సుబ్బరాజు, సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్ మాట్లాడారు. విద్యార్థులు చదువుకోవడానికి సమయాన్ని కేటాయిస్తే అదే భవిష్యత్తును ఉన్నతమైన స్థాయిలో నిలబెడుతుందని సూచించారు. స్వాతంత్ర్య సమరయోధులు, చదువుకున్న ప్రతి విద్యార్థి భవిష్యత్తులో ఎలాంటి ఉద్యోగాల్లో స్థానం సంపాదించగలరో అలాంటి వేషధారణలో, 150 మీటర్ల జాతీయ పతాకాన్ని తీసుకొని గ్రామ వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎంపిడిఒ సుబ్బరాజు జెండా ఊపి ప్రారంభించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'ప్రజా పోరు'

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రామాంజనేయులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా పోరు బాట నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు, పట్టణ కార్యదర్శి పి.గోవిందు తెలిపారు. సోమవారం సిపిఎం ప్రజాపోరు ప్రచారం పట్టణంలోని లక్ష్మీపేటలో శ్రీనివాస టాకీస్ ఏరియా, సంజీవనగర్, లక్ష్మీ పేట ప్రాంతాల్లో సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెరిగిన ధరలతో ప్రజలు అల్లాడిపోతున్నారని, నిత్యావసర సరుకుల ధరలు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయని తెలిపారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని, ట్రూ అప్ చార్జీల పేరుతో అదనపు భారాలు వేయకుండా, ఇసుక ఉచితంగా ఇస్తామని ఎన్నికల ముందు హామీఇచ్చారని చెప్పారు. పేరుకు మాత్రమే ఉచిత ఇసుకని తెలిపారు. సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు రాముడు, రమేష్, కార్యకర్తలు అబ్దుల్లా, సుభాన్, వెంకటేష్, తిమ్మప్ప, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

నందవరంలో ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సి.గురుశేఖర్, ఎమ్‌డి.ఆనంద్‌బాబు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరారు. ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 8 నుంచి 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు చేపట్టినట్లు తెలిపారు. ఈనెల 15న సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. మండలంలోని రాయచోటి, పొనకలదిన్నె, నాగులదిన్నె, నందవరంలో ప్రచారం నిర్వహించినట్లు చెప్పారు. సిపిఎం మండల నాయకులు రాయచోటి దేవదాసు, స్వామిదాసు, పొనకలదిన్నె పెద్దయ్య, నరసింహులు, నాగులదిన్నె ఎల్లేష్, రవి, సంతోష్, కొండన్న పాల్గొన్నారు. **ఆస్పరి** మండలంలోని కైరుప్పల, పుప్పాలదొడ్డి, హాలిగేరి, శంకర బండ, చిరుమాన్‌దొడ్డి గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు హనుమంతు మాట్లాడారు. ఈనెల 14న మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు చేపట్టే ధర్నాలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మండల నాయకులు బాలకృష్ణ, నాయకులు రంగస్వామి, రామాంజనేయులు, చిన్న ఈరన్న, రవి, నరసింహులు, రంగన్న, వీరబద్రి, రామాంజినేయులు పాల్గొన్నారు. **ఆలూరు** మండలంలోని పెద్దహోతూరు, మరకట్టు, మనేకుర్తి, హత్తిబెళగల్, కురవల్లి, అగ్రహారం గ్రామాల్లో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి మాట్లాడారు. ఈనెల 14న తహశీల్దార్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మండల కార్యదర్శి షాకీర్, మండల నాయకులు కృష్ణ, మైనా, విఠల్, అకీరా నందన్ పాల్గొన్నారు. **హొళగుందలో** గోడపత్రికలు సిపిఎం నాయకులు వెంకటేష్, నాగరాజు విడుదల చేశారు. మల్లేష్, శంకర్, ఈరన్న పాల్గొన్నారు. **పెద్దకడబూరు** నుంచి ప్రజా సమస్యలపై ప్రజాపోరు ఆటో జాతా ప్రారంభించి వివిధ గ్రామాల్లో నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, నాయకులు పరమేష్, నాయకులు బాబు, వెంకటేష్, శ్రీనివాసులు, హనుమంతు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో నిరసన తెలియజేస్తున్న నాయకులు

నందవరంలో మాట్లాడుతున్న నాయకులు

పశుగ్రాసం సాగుకు ఆర్థిక సాయం

- పశు వైద్యాధికారి మహేష్

ప్రజాశక్తి - చిప్పగిరి



రైతులకు పశుగ్రాసం కొరత ఏర్పడకుండా పశు గ్రాసాల సాగుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని పశు వైద్యాధికారి మహేష్ తెలిపారు. సోమవారం నేమకల్లు గ్రామ పశువైద్య కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బహు వార్షిక పశుగ్రాసం సాగు నిమిత్తం ఐదెకరాల భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు, ఐదెకరాల భూమి కలిగిన చిన్న, సన్న కారు రైతులకు సాగు చేయడానికి మొత్తం ఖర్చు ప్రభుత్వం ఉపాధి హామీ నిధుల ద్వారా ఒక సంవత్సరం వరకు నిధులను అందిస్తుందని తెలిపారు. కావాల్సిన రైతులు అప్లికేషన్ ఫారంతో పాటు జాబ్ కార్డు, పొలం వన్ బి, ఆధార్ కార్డు, బ్యాంకు పాసుబుక్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలను రైతు సేవా కేంద్రంలోనూ, పశు వైద్య కార్యాలయంలోనూ ఇచ్చి పూర్తి వివరాలను కూడా అక్కడనే తెలుసుకోవచ్చని చెప్పారు.

నీటి పన్ను చెల్లించిన రైతులు అర్హులు : తహశీల్దార్ సతీష్

ప్రజాశక్తి - హొళగుంద

నీటి వినియోగదారుల సంఘం ఎన్నికకు నీటి పన్ను చెల్లించిన రైతులు అర్హులవుతారని తహశీల్దార్ సతీష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు త్వరలో జరుగుతాయని, ప్రతి రైతూ సంబంధిత సచివాలయాల్లో నీటి పన్ను చెల్లించే వెసలుబాటు ఉందన్నారు. రైతులు ఎవరూ నీటి పన్ను చెల్లించేందుకు తహశీల్దార్ కార్యాలయంలో విఆర్ఒల చుట్టూ తిరిగి విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని తెలిపారు. హొళగుంద మండలంలో 14 గ్రామాల్లో ఆయకట్టు రైతులు ఉన్నారని పేర్కొన్నారు.

మూడు నీటి వినియోగదారుల సంఘాలు : మండలానికి మూడు నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయని, ఒక్కో సంఘానికి 12 మంది టిసి మెంబర్లు ఉంటారని తెలిపారు. టిసి మెంబర్లను రైతుల ఎన్నుకుంటే, 12 మంది టిసి మెంబర్లు ప్రెసిడెంట్‌ను, వైస్ ప్రెసిడెంట్‌ను ఎన్నుకుంటారని చెప్పారు.

త్వరలో ఎన్నికలు : నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు ఈనెల 21 నుంచి 23 వరకు జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. నీటి పన్ను చెల్లించని రైతులు సకాలంలో పన్నులు చెల్లించి ఎన్నికకు అర్హత పొందాలని సూచించారు.

చెస్ పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి - ఆదోని

నేత్ర దాన 'ఐ' ఫౌండేషన్, స్పార్క్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో నేషనల్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని హైస్కూల్ కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అండర్-11 విభాగంలో నేషనల్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి కె.సాత్విక్, అండర్-15 విభాగంలో విశ్వేశ్వర్ మొదటి స్థానం కైవసం చేసుకున్నారని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తూ భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ విజయ్ కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఆదోని

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో యుటిఎఫ్ ముందంజలో ఉందని నాయకులు తెలిపారు. యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు గూడూరు పట్టణంలో శని, ఆదివారాల్లో రెండు రోజులపాటు జరిగాయి. ఈ మహాసభలో జిల్లా కార్యవర్గంలో ఆదోని నాయకులకు ప్రాతినిధ్యం దక్కింది. జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆ కమిటీలో ఆదోని డివిజన్ నుంచి యుటిఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షులుగా బి.జీవిత, జిల్లా కార్యదర్శిగా టి.గాదిలింగప్ప, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా జి.శ్రీనివాసులు, ఆడిట్ సభ్యులుగా వై.రామాంజనేయులు, మల్లికార్జున, జిల్లా అకాడమిక్ కన్వీనర్‌గా ఈ.నరసయ్య గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదోని ప్రాంతంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా అహర్నిశలు కృషి చేస్తామని కార్యవర్గం తెలిపారు.

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా కౌలన్న ఎన్నిక పట్ల హర్షం

పెద్దకడబూరు : యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా మండలానికి చెందిన డి.కౌలన్న ఎన్నిక పట్ల మండల కమిటీ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ప్రశాంత్, భూపాల్, కె.శివకుమార్ మాట్లాడారు. ఆదివారం గూడూరులో జరిగిన జిల్లా మహాసభల్లో మండలానికి చెందిన ఉపాధ్యాయులు డి.కౌలన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల స్థాయి నుంచి కౌలన్న ఉపాధ్యాయుల సమస్యలపై ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారని చెప్పారు.

గొడవలకు దూరంగా ఉండాలి

- ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు సూచించారు. సోమవారం మండలంలోని పెద్దకడబూరు, కల్లుకుంట గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. క్షణికావేశంతో గొడవలు పడి నేరాలకు పాల్పడకూడదని తెలిపారు. ప్రస్తుతం ప్రజలు సైబర్ నేరాల వల్ల నష్టపోతున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్‌లో పార్ట్ టైమ్ జాబ్స్ పేరుతో జరిగే మోసాలకు గురికాకూడదన్నారు. సైబర్ నేరాల ద్వారా మోసపోయినట్లు గుర్తించిన వెంటనే 1930 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కోసిగి సిఐ బి.ఎ.మంజునాథ్, ఎస్ఐ నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

ఉర్దూ పత్రిక చీఫ్ ఎడిటర్‌కు అరుదైన గౌరవం

- మీడియా లైఫ్ అచివ్‌మెంట్ అవార్డు

ప్రజాశక్తి - ఆదోని

అవార్డు అందుకున్న ఈషా బాష

భారతరత్న మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ ఉర్దూ అకాడమీ లైఫ్ అచివ్‌మెంట్ అవార్డు పట్టణానికి చెందిన బాజ్మే అదల్ చీఫ్ ఎడిటర్ ఈషా బాషకు లభించింది. సోమవారం ఆజాద్ జయంతి సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం అవార్డు ప్రదానం చేపట్టారు. మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎమ్‌డి.ఫరూక్, మైనారిటీ వెల్ఫేర్ ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్ షరీఫ్, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నాసీర్, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసులు హాజరయ్యారు. అనంతరం మైనారిటీ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ షిరీన్, ఎపి స్టేట్ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మస్తాన్ వలీ చేతుల మీదుగా ఈషా బాష అవార్డు అందుకున్నారు. ఈషా బాషకు లైఫ్ టైం అచివ్‌మెంట్ అవార్డు రావడంతో ఎపి ఉర్దూ న్యూస్ పేపర్ ఎడిటర్ అసోసియేషన్ అధ్యక్షులు కరీముల్లా ఖాన్ హర్షం వ్యక్తం చేశారు. పలువురు అభినందనలు తెలిపారు.

బిణిగేరి నుంచి శ్రీశైలానికి పాదయాత్ర

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని బిణిగేరి నుంచి శ్రీశైలానికి వెయ్య మంది పాదయాత్రగా బయల్దేరారు. సోమవారం గ్రామ కొండల్లో వెలసిన శ్రీగిరి క్షేత్రం పంచలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు శ్రీనివాస్ నాయన ఆధ్వర్యంలో పాదయాత్రగా బయల్దేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మూడు రోజుల పాటు అడవిలో పాదయాత్ర జరుగుతుందని తెలిపారు. బుధవారం శ్రీశైలం చేరుకొని శ్రీభ్రమరాంబ, మల్లికార్జున స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రసాద్, రవి చంద్ర, కృష్ణా రెడ్డి, భీమన్న, వీరేష్, సుధా, నాగరాజు, సూరి, ముక్కన్న, తిక్కయ్య, గురూజీ, సంతోష్ స్వామి, బాలాజీ స్వామి, నీలకంఠ, దత్తాత్రేయ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

సిఐ సుదర్శన్ రెడ్డి అక్రమ బదిలీ ఆపాలి

- ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణ సిఐ సుదర్శన్ రెడ్డి బదిలీని ఆపేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం విద్యార్థినులతో కలిసి ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. ఎపి సిఐఎల్ నాయకులు గణేష్ అధ్యక్షత వహించారు. నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ నాయకులు ప్రసన్నకుమార్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రంగ స్వామి, హెచ్‌ఆర్‌సి రైట్ టు ఇన్ఫర్మేషన్ ట్రస్ట్ డివిజన్ అధ్యక్షులు అజిత్ కుమార్ మాట్లాడారు. పట్టణ సిఐ సుదర్శన్ రెడ్డి ఎమ్మిగనూరుకు వచ్చి మూడు నెలలైందని తెలిపారు. పట్టణంలో శాంతిభద్రతలు మెరుగు పరచారని, అలాగే గంజాయి, గుట్కా, జూదం, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపి అణచివేశారని చెప్పారు. శాంతిభద్రతలను పరిరక్షిస్తున్న సిఐని ప్రభుత్వం అక్రమంగా బదిలీ చేయడం సిగ్గుచేటని తెలిపారు. సిఐ సుదర్శన్ రెడ్డి బదిలీని ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమతా సైనిక్ దళ్ రాష్ట్ర కార్యదర్శి రంగయ్య చౌదరి, ఎఐటియుసి నాయకులు తిమ్మ గురుడు, వాల్మీకి నాయకులు యాపిలయ్య, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విజయ్, మాల మహానాడు నాయకులు నరసన్న, ఉస్సేని, సిపిఎంఎల్ ఏసేపు, మల్లెల గ్రూప్ సభ్యులు హనుమంతు, ఎర్రకోట అరుణ్, పరిగె రాజేష్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు సత్యన్న, బాలరాజు, బాబు, విద్యార్థి సంఘ నాయకులు ఖాజా, కృష్ణ, ఉస్సేని, లక్ష్మన్న, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మానవహారం, రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు

ఉద్యోగోన్నతుల్లో న్యాయం చేయాలి

- ఎపి ఎంటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నంద్యాల, ఆదోని పురపాలక ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతుల్లో అన్యాయం చేయాలని ఎపి ఎంటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, ఆదోని శాఖ అధ్యక్షులు అనిల్ కుమార్ కోరారు. సోమవారం ఆదోనిలోని మున్సిపల్ నెహ్రూ మెమోరియల్ హైస్కూల్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 14 ఏళ్లుగా మున్సిపల్ విద్యావ్యవస్థలో ఒక్క పోస్టు కూడా మంజూరు కాకపోవడంతో జిల్లాలో పురపాలక ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోందని తెలిపారు. ఉన్న అరకొర పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కే కేటాయించడం వల్ల, 70:30 విధానాన్ని పాటించడంలో జరిగిన లోపాలు ఉద్యోగోన్నతులు పొందే మున్సిపల్ ఉపాధ్యాయులను నిరాశకు గురిచేస్తోందని చెప్పారు. మున్సిపల్ యూనిట్‌లో భౌతిక శాస్త్ర పోస్టులు 20 ఉండగా, 15 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని తెలిపారు. ఇందులో 12 మంది ఉద్యోగోన్నతులు పొందిన వారు, ఐదుగురు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా వచ్చిన వారు ఉన్నారని వివరించారు. గణితంలో 22 పోస్టులకు గాను 20 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని తెలిపారు. ఇందులో 13 మంది పదోన్నతులు పొందిన వారు, ఏడుగురు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ అయ్యారని చెప్పారు. మిగిలిన రెండు ఖాళీ పోస్టులను 70:30 విధానం ద్వారా భర్తీ చేయకుండా డైరెక్ట్ రిక్రూట్‌ంట్‌కే కేటాయించారని తెలిపారు. వ్యాయామ, పండిట్ పోస్టులను కూడా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కే కేటాయించడం వల్ల ఉద్యోగోన్నతులు లేక మున్సిపల్ ఉపాధ్యాయులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు కోటన్న, ఆనంద్, శ్వేతాభాయి, ప్రకాశమ్మ, రాధమ్మ, సునంద, సుబేదమ్మ, రేణుకా దేవి, అపర్ణ, లలితమ్మ, కల్యాణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

IN THE COURT OF THE IInd Addl Jr. Civil Judge : Kurnool.
O.S. No. 662/2017
Samojai Masood Ahmed Khan ...Plaintiff
-Vs-
Gavvala Laxmidevi and others. ...defendants
SUIT SUMMONS TO DEFENDANT No.2
P. Chandramouliswar,
S/o. Ramalakshmaiah,
H.No. 62/143m, Chidambararao Street,
Kurnool City.
పై నెంబర్ దావాలో వాది ప్రతివాదులపైన దావా షెడ్యూలు ఆస్థిలో వాదికి హక్కు ఉన్నదని తీర్మానంచేయమని.
2) దావా షెడ్యూలు ఆస్థిలో ప్రతివాదులు గాని వారి మనుషులు గాని ప్రవేశించకుండ ఇంజక్షన్ ఉత్తర్వు ఇప్పించమని.
3) 14-10-2004 తేదీన ఉన్న విక్రయ దస్థావేజు నంబర్ 7544ను రద్దు చేయమని మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని దావా దాఖలు చేసినాడు. ఇందులో 2వ ప్రతివాది అయిన నీకు ఆక్షేపణ ఉన్న 25-11-2024న తేదీన పగలు 10:30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల నీపరోక్షమున విచారించి తీర్మానింపబడును.
షెడ్యూలు : Kurnool Division, Kallur Sub-Division, Kurnool Town, within the limits at kallur panchayat, Now Kurnool Municipal Corporation, In word No.7, Plot No. 259-B, Situated in Sy.No.106/1AB, 106/1A2D, 106/1B3 and 106/1B6 with L.P. No. 44/88 to an extent of AC.122.22 Sqr. Yards,
Bounded by :
East : Plot no. 260,
West : Plot No.259-A,
North : 60 feet wide Road,
South : Plot No. 265.
Measurements :
East - West: 20 feet; North-South: 55 feet
Totally-122.22 Sq yards.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
G . BHARGAVI
వాదిపరం అడ్వకేటు, కర్నూలు.

మాట్లాడుతున్న మానసిక వైద్యులు డాక్టర్ సింధుజ

మానసిక ఒత్తిడిని అధిగమించాలి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నేటి కాలంలో ఒత్తిడి అనేది చాలామందిలో ఎక్కువైందని, దానిని అధిగమించాలని శాంతిరాం హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సింధుజ అన్నారు. సోమవారం స్థానిక ఎద్దుల పాపమ్మ ఉన్నత పాఠశాలలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కోట కందుకూరు మోడల్ స్కూల్లో జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా మానసిక ఒత్తిడిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సింధుజ మాట్లాడుతూ నేటి కాలంలో ఒత్తడి అనేది చాలా ఎక్కువైందని, ఒత్తిడి అనేది ఒక మానసిక ప్రతిస్పందన అని ఆమె అన్నారు. విద్యార్థులకు పరీక్షలు అంటే భయపడడం సహజమని , కానీ దానిని అధిగమించాలని, మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. ఒత్తిడిని దూరం చేసేందుకు యోగా, మంచి నిద్ర, ఆటలు, విశ్రాంతి తీసుకోవడం, కాలాన్ని వృధా చేయకుండా ఉండడం లాంటివి చేయాలన్నారు. అలాగే మహిళలకు ఆరోగ్యం అనేది సామాజిక, ఆర్థిక, వైద్యపరంగా చాలా ముఖ్యమైన విషయం అన్నారు. సరిగా మంచి ఆహారం తీసుకోవడం రోజు వ్యాయామం చేయడం ద్వారా శరీరాన్ని చురుకుగా ఉంచుకోవచ్చని, మానసికంగా ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భవ్య, డాక్టర్ సాయి చరణ్, శాంతిరాం హాస్పిటల్ సిఆర్వోలు వైవి రమణ, డి కిషోర్ బాబు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజు, కస్తూరిబా ప్రిన్సిపాల్ సుందర కవిత, వైస్ ప్రిన్సిపాల్ నరేంద్ర, ఎద్దుల పాపమ్మ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీర రాఘవయ్య, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఉషారాణితో పాటు అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తికి 14 రోజుల జైలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : బహిరంగ ప్రదేశంలో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి 14 రోజుల జైలు శిక్ష పడినట్లు నంద్యాల టు టౌన్ సిఐ షేక్ ఇస్మాయిల్ తెలిపారు. సిఐ మాట్లాడుతూ నంద్యాలలోని విశ్వనగర్‌కు చెందిన వ్యక్తి షేక్ బషీరుల్లా శ్రీరామ సినిమా హాల్ వద్ద రోడ్డుపై వెళ్తున్న మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వద్ద హాజరుపరచగా జడ్జి సదరు వ్యక్తికి 14 రోజులు జైలు శిక్ష విధించిన్నట్లు తెలిపారు.

అమన్ కూల్ డ్రింక్ షాపు ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్ : నంద్యాలలోని గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన అమన్ కూల్ డ్రింక్స్ అండ్ ఫ్రూట్ జ్యూస్, ఐస్ క్రీమ్ షాపును టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు అన్ని రంగాలలో రాణించాలని, పదిమందికి ఉపాధి అవకాశం కల్పించే విధంగా ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో షాపు యజమాని షేక్ అమీర్ భాష, షేక్ అక్బర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

13న పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి - రుద్రవరం : గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ఈనెల 13న మండల పరిషత్ సమావేశ భవనంలో ఒక్కరోజు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ పంచాయతీ గ్రామ అభివృద్ధి ప్రణాళిక శిక్షణ తరగతులకు మండల స్థాయి అధికారులైన పంచాయతీ రాజ్ ఏఈ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, ఉపాధి పథకం ఏపీఓ, పంచాయతీ కార్యదర్శులు, వైద్యాధికారులు, వెటర్నరీ అసిస్టెంట్లు, వ్యవసాయ అధికారి, ఐసిడిఎస్ సూపర్వైజర్, సర్పంచులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ప్రతి గ్రామ ఐక్య సంఘం నుండి ఒక అధ్యక్షులు , డిజిటల్ అసిస్టెంట్లు హాజరు కావాలన్నారు. శిక్షణ తరగతికి వచ్చేవారు తప్పకుండా వారి ఆధార్ కార్డు, దానికి లింకు అయిన ఫోన్ నెంబర్ ను తీసుకురావాలని ఆమె తెలిపారు.

ఐక్యమత్యంతో ఏదైనా సాధించొచ్చు

- దూదేకుల సంఘం అధ్యక్షుడు చిన్న జమాల్ బాషా

ప్రజాశక్తి - గడివేముల

ఐక్యమత్యంగా ఉంటేనే ఏదైనా సాధించవచ్చని దూదేకుల సంఘం అధ్యక్షుడు, మాజీ సర్పంచి జమాల్ బాషా తెలిపారు. కొత్త బస్టాండు ప్రాంతంలోని దూదేకుల భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దూదేకుల కులస్తులకు ప్రాధాన్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా దూదేకుల కులస్తులు అధికంగా ఉన్న డొంగు ప్రాంతంలో ప్రత్యేక మసీదు కోసం స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. మండల, జిల్లా, రాష్ట్రస్థాయి దూదేకుల సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. దూదేకుల కులంలో నిరుపేదలుగా ఉన్న ప్రతి ఒక్కరికి సంఘం అండగా ఉంటుందని, అందరి సహకారంతో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. దూదేకుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి సమస్యలను పరిష్కరించుకుందామన్నారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన నామినేటెడ్ పదవుల్లో దూదేకుల సంఘానికి అన్యాయం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో దూదేకుల సంఘం ఫెడరేషన్ ఏర్పాటు చేసి రూ. 100 కోట్ల నిధిని ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న రోజుల్లో నామినేటెడ్ పదవుల్లో దూదేకుల, నూర్ బాషాలకు ప్రత్యేక స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేవంలో దూదేకుల సంఘం నాయకులు ఆర్మీ జమాల్ బాషా, టీచర్ మాబాష, యాసిన్‌బాష, సుభాన్, షేక్షావలి, సోపి, రఫీ, చంటి, ముక్తార్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దూదేకుల సంఘం నాయకులు

నంద్యాల డిఎస్‌పిగా పి.శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల డిఎస్పీగా పి.శ్రీనివాస్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1996 బ్యాచ్‌కు చెందిన శ్రీనివాస్ రెడ్డి సబ్ ఇన్స్పెక్టర్‌గా పోలీస్ శాఖలో ప్రవేశించి 2007లో ఇన్స్పెక్టర్‌గా ప్రమోషన్ పొంది కర్నూలు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించారు. 2020లో డిఎస్పీగా ప్రమోషన్ పొంది పత్తికొండ డిఎస్పీగా విధులు నిర్వహించారు. ఇటీవల డిఎస్పీల బదిలీలో భాగంగా నంద్యాల డిఎస్పీగా శ్రీనివాస్ రెడ్డిని నియమిస్తూ డిజిపి ద్వారకా తిరుమల రావు ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. డిఎస్పి శ్రీనివాస్ రెడ్డిని రెండో పట్టణ సీఐ ఇస్మాయిల్ ఎస్ఐలు సుధాకర్ రెడ్డి సురేష్, డిఎస్పి కార్యాలయం సిబ్బంది జంబులయ్య సురేష్ రెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు స్వీకరించిన డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల పరిధిలో పూర్తిస్థాయిలో అసాంఘిక కార్యకలాపాల అదుపునకు, నేరాల అదుపునకు కృషి చేస్తామన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి : ఎఐఎస్‌ఎఫ్

ప్రజాశక్తి - బేతంచర్ల

ఈ నెల 14న నంద్యాల పట్టణంలో నిర్వహించే ఎఐఎస్ఎఫ్ ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై భార్గవ్, నంద్యాల జిల్లా కార్యదర్శి ధనుంజయలు కోరారు. పట్టణంలోని పాణ్యం జూనియర్ కాలేజ్‌లో న్యాయసభ జిల్లా ఉపాధ్యక్షులు వై ఉదయ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు హాస్టల్లో మెస్సు, కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలని, జిఒ నెం. 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పించాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఎఐఎస్ఎఫ్ కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా అనిల్, లక్ష్మణ్ నాయుడులతోపాటు 11 మందిని ఎన్నుకున్నారు. సమావేశంలో కో-శాధికారి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రి స్వామి, మండల నాయకులు తరుణ్, బాలకృష్ణ, హర్ష ప్రదీప్, కిరణ్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

కామేశ్వరిదేవికి బంగారు కాసుల హారం విరాళం

ప్రజాశక్తి - మహానంది

మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరి దేవి అమ్మవారికి భక్తులు 17.5 గ్రాముల బంగారు కాసుల హారాన్ని ఆలయ ఇఒ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డికి సోమవారం అందజేశారు. కర్నూలు జిల్లా పెద్దపాడు గ్రామ వాస్తవ్యులు చంద్రకళాధర్ రెడ్డి, వారి కుమారుడు లోకేష్ రెడ్డి, మాధవి దంపతులు రూ. 1లక్షా 35వేలు విలువైన బంగారు కాసుల హారం అందజేసినట్లు ఇఒ తెలిపారు. ఆలయ ఇఒ దాతలను అభినందించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అన్నదాన పథకానికి విరాళాలు

మహానంది పుణ్యక్షేత్రంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి భక్తులు సోమవారం విరాళాలు అందజేశారు. మండలంలోని మసీదుపురం గ్రామానికి చెందిన శ్రీ వెంకటేశ్వర పాలిమర్స్ వ్యాపార సంస్థ శ్రీనివాస రెడ్డి నిత్య అన్నదానానికి లక్ష రూపాయల చెక్కును విరాళంగా ఆలయ ఇఒకి అందజేవారు. దాతను అభినందించి, శేషవస్త్రంతో సత్కరించి, బాండు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. అలాగే నంద్యాల బాలాజీ కాంప్లెక్స్ కృష్ణమూర్తి జ్యోతి దంపతులు అన్నదాన పథకానికి రూ.34 వేలు విరాళంగా అందజేశారు. వీరిని స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, బాండును ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఎఇఒ మధు, ఆలయ పర్యవేక్షకులు శశిధర్ రెడ్డి, వేద పండితులు రవిశంకర అవధాని పాల్గొన్నారు.

బంగారు కాసుల హారం అందజేస్తున్న దాతలు

మద్యం సేవించి అల్లరి చేసిన..

యువకులకు ఏడు రోజులు జైలు

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని కడమల కాల్వ గ్రామానికి చెందిన మధు వంశీ(22) నాగబాబు(21) అనే యువకులు సోమవారం మద్యం సేవించి గ్రామంలో అల్లర్లు సృష్టించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని నంద్యాల కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. గ్రామాల్లో అల్లరి చేసిన నాగబాబు, మధువంశీలకు మెజిస్ట్రేట్ ఏడు రోజుల రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు. అలాగే గ్రామాల్లోని యువత చెడు వ్యసనాలకులోనై మద్యం సేవించి ప్రధాన కూడల్లో, రహదారుల్లో ప్రజలకు ఇబ్బందులు కలగజేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - చాగలమర్రి : గ్రామాల అభివృద్ధి తెలుగుదేశం ప్రభుత్వంతోనే సాధ్యమని పార్టీ నాయకులు తెలిపారు. సోమవారం స్థానిక పాతబస్టాండులో టిడిపి ప్రధాన కార్యదర్శి ఆలంసా గారి హనీఫ్, వార్డు సభ్యులు మౌలాలిల ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. పార్టీ సభ్యత్వ నమోదుతో కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాఠశాల కమిటీ చైర్మన్ గౌస్ మొహిద్దిన్, 4వ ఎంపిటిసి ఇంచార్జి జెట్టి నాగరాజు, పీరమ్మగారి హుసేన్‌సా వళి, అబ్దుల్లా, మాబుపీరా, ఎస్‌పి మాబాష, గడెకారి మహమ్మద్, మాబు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు కార్యక్రమం చేస్తున్న టిడిపి నాయకులు

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ తైక్వాండో పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశామని రాష్ట్ర టైక్వాండో జనరల్ సెక్రెటరీ ఎల్.టి చంద్రమౌళి తెలిపారు. పట్టణంలోని మౌళి తైక్వాండో అకాడమీ నందు సబ్ జూనియర్ టైక్వాండో సెలక్షన్స్ జరిగాయి. కర్నూలు, నంద్యాల, ఆళ్లగడ్డకు సంబంధించిన క్రీడాకారులు సుమారు 100 మంది ఈ పోటీలలో పాల్గొన్నారు. సెలక్షన్స్ నిర్వహించి ఇందులో గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఈనెల 15 నుండి 17వ తేదీలలో ప్రకాశం జిల్లా కందుకూర లో జరగబోవు 38వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ టైక్వాండో పోటీలకు ఎంపిక చేశామని చంద్రమౌళి వివరించారు. నంద్యాల కు చెందిన జాతీయ క్రీడాకారుడు ఎస్ ఫర్వాతుల్లా, జాతీయ క్రీడాకారిణి ఎల్. టి భువనేశ్వరి, కర్నూలుకు చెందిన కోచ్ ఇబ్రహీం, కర్నూలు బషీర్, నాయక్ తదితర కోచ్‌లు పాల్గొన్నారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - సంజామల

సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రమణయ్య కోరారు. సోమవారం మండలంలోని ముదిగేడు గ్రామంలో ప్రజలతో నిర్వహించిన సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ మోసాలు అధికమయ్యాయని, ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్లో ఆధార్, బ్యాంకు ఖాతాల వివరాలు అడిగితే తెలపరాదని సూచించారు. అనంతరం ముదిగేటమ్మ ఆలయం వద్ద వాహనాలు తనిఖీ నిర్వహించారు. రికార్డులు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయల ప్రదర్శన

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వీరబ్రహ్మేంద్ర మండల మహిళా సమైక్య డిఆర్‌డిఏ వెలుగు కార్యాలయం సమీపంలో ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు, ఆకుకూరల స్టాల్‌ను మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి ప్రారంభించారు. వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలిక జబ్బులకి బీపీ,షుగర్, ప్రకతి వ్యవసాయంలో పండించిన కూరగాయలు తినడం ద్వారా ఉపశమనం లభిస్తుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు ఆకుకూరలు తినడం వల్ల ఎలాంటి రోగాలు రావని తెలిపారు . ప్రజలు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు ఆకుకూరలను కొనుగోలు చేసి, వాటిని పండించేందుకు ప్రోత్సహించాలన్నారు. మనం తినే ఆహారం విషతుల్యమవుతుందని ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు ఆకుకూరలను కొనుగోలు చేసి ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె మండలం ఇన్చార్జి యం.టి.విజయ భాస్కర్, సిబ్బంది విశ్వనాథ రెడ్డి ,బండి రామచంద్రారెడ్డి, కుల్లాయి స్వామి, లత తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలను ప్రదర్శిస్తున్న దృశ్యం

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

బిటి నాయుడు ఎమ్మెల్సీ కావడం హర్షనీయం

ప్రజాశక్తి- మద్దికేర

జాతీయ విద్య దినోత్సవం సందర్భంగా పదవి విరమణ పొందిన వెంకటేశులుకు ఘనంగా ఆత్మీయ సన్మానం చేసినట్లు యుటిఎఫ్ నాయకులు నాగరాజు, విశ్వనాథ్ తెలిపారు. ఎంఇఒ కార్యాలయం వద్ద జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సవిత, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు హజరత్ బాబు, రంగస్వామి, టిడిపి నాయకులు ధనుంజయుడు, ఎంపిడిఒ కొండయ్య మాట్లాడుతూ పదవి విరమణ పొందిన వెంకటేశులు తమ 45 ఏళ్ల సుదీర్ఘ విద్యా బోధన, క్రమశిక్షణతో సమయపాలన పాటించేవాడని అన్నారు. ఆయనతో విద్యాబోధ నేర్చుకున్న వారు డాక్టర్లు పోలీసులు ఇంజనీర్లు, తదితర ఉన్నత స్థాయిలో ఉన్నారని హర్షం వ్యక్తం చేశారు. ఆయనతో చదువుకున్న విద్యార్థి బిటి నాయుడు గతంలో కర్నూలు టిడిపి ఎంపీగా రెండుసార్లు పోటీ చేశాడని, ప్రస్తుతం ఆయన ఎమ్మెల్సీగా పనిచేస్తున్నాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు చిన్ననాటి గురువులను స్మరించుకొని సన్మాన గ్రహీతకు అభినందనలు తెలిపారు. ఎంఇఒ రంగ స్వామి మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశంలో తీసుకొచ్చిన విద్యా సంస్కరణలు గురించి వివరించారు. మండల విద్యాధికారి 2 గోపాల్, ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఎఐఎస్ఎఫ్, నాయకులు శ్రీకాంత్, ఆపద్బాంధవ సేవ సమితి అధ్యక్షులు సునీల్ కుమార్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలానికి వేలంపాట

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

౦౦ంకర్నూలు గుత్తి పెట్రోల్ పంపు సమీపంలోని వాహనాల పార్కింగ్ స్థలానికి రాబోయే ఏడాది కాలానికి సంబంధించి సోమవారం నగరపాలక అధికారులు వేలంపాట నిర్వహించారు. ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలో నగరపాలక కౌన్సిల్ హాలులో అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ అధ్వర్యంలో వేలంపాట నిర్వహించగా, ఎక్కువ మొత్తంలో వేలంపాట పాడి కె.మధు అనే వ్యక్తి రూ.5,06,000 లక్షలకు పార్కింగ్ స్థలాన్ని దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఒ జునైద్, ఆర్ఐలు భార్గవ్, తిప్పన్న, సిబ్బంది రాజు, వందన పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో న్యుమోనియాను నివారించవచ్చు

-డాక్టర్ సువర్ణలక్ష్మీ సూచనలు, సలహాలు

-నేడు వరల్డ్ న్యుమోనియా డే

ప్రజాశక్తి-కర్నూలు హాసిటల్

ముందస్తు పరీక్షలు చేయించుకుని ఫలమనాలజిస్టు సలహాలు పాటిస్తే న్యుమోనియాను నివారించవచ్చని మెడికవర్‌హాస్పిటల్స్ పల్మోనరి మెడిషన్ ఎండి , కన్‌సల్టెంట్ డాక్టర్ సువర్ణ లక్ష్మీ తెలిపారు. వరల్డ్ న్యుమోనియా డే సందర్భంగా ఆమె తెలిపిన వివరాల ప్రచారం....న్యుమోనియా అనేది మనం పీల్చే గాలితో పాటుగా బాక్టీరియా, వైరస్, ఫంగి వంటి సూక్ష్మజీవులు శరీరంలోకి ప్రవేశించడం వల్ల కలిగే ఊపిరితిత్తులు ఇన్ఫెక్షన్. వ్యాధి సోకిన వ్యక్తి దగ్గడం,తుమ్మడం వల్ల క్రిములు మనం పీల్చే గాలిలోకి వ్యాప్తిచెందుతాయి లేదా వస్తువులపై పడతాయి. పిల్లలు, వృద్ధులు, డయాబెటిస్, ఆల్కహాల్, స్మోకింగ్, హెచ్ఐవి , ఆస్తమా , ఇతర దీర్ఘ కాలిక ఊపిరితిత్తులు సమస్యలు, కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో న్యుమోనియా వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. న్యుమోనియా ముఖ్య లక్షణాలు - దగ్గు, జ్వరం, శ్వాసతీసుకోడంలో ఇబ్బంది, ఛాతినొప్పి ఎలాంటివి ఉంటాయి.

తీసుకోవాల్సిన జాగ్రతలు: దగ్గేటప్పుడు , తుమ్మేటప్పుడు ముక్కును , నోరుని కప్పుకోవాలి. సబ్బుతో చేతులను క్రమం తప్పకుండా కడుకోవాలి. ముక్కు, నోరుకళ్ళను తరచుగా తాకకుండా ఉండటం. ప్రోటీన్, విటమిన్ - సి, జింక్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం. దగ్గు, జలుబు ఉన్నప్పుడు లేదా రద్దీ ప్రదేశాలకి వెళ్ళి నప్పుడు మాస్క్ తప్పకుండా దరించాలి. న్యుమోనియా వాక్సిన్, రొటీన్ చెకప్ తీసుకోవడం వల్ల న్యుమోనియా ని నివారించవచ్చు. దీనిని ముందే గుర్తించి కంట్రోల్ చేస్తే బయటపడవచ్చు. కాని వ్యాధి తీవ్రత పెరిగితే చాలా ప్రమాదకరం , అందుకే పైన వివరించిన లక్షణాలు , రోగనిరోధక శక్తి తక్కువ ఉన్న వాళ్ళు నిర్లక్షం చేయకుండా ఫలపనాలజిస్ట్ నిపుణుడని సంప్రదించాలి.



రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు శ్రీ లక్ష్మీ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ క్రికెట్ పోటీలకు శ్రీలక్ష్మీ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ దీక్షిత్, హెచ్ఎం.అరుణ తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమానికి వారు హాజరై రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. కరెస్పాండెంట్ దీక్షిత్ మాట్లాడుతూ అండర్ 17 క్రికెట్ బాలుర విభాగంలో జగదీష్, బాలికల విభాగంలో రక్షిత, అండర్ 14 విభాగంలో రుత్విక్ కళ్యాణ్ లు జిల్లాస్థాయిలో మంచి ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. తమ పాఠశాలలో చదువుతో పాటు విద్యార్థులు క్రీడారంగంలో రాణిస్తూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. విద్యావేత్త శేషన్న వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ దీక్షిత్

తాగునీటి సమస్యను పరిష్కరించండి : సిపిఎం

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

బైరాపురం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి బి.నాగన్న డిమాండ్ చేశారు. సోమవారం ఓర్వకల్లు మండల పరిధిలోని బైరాపురం లొద్ది పిల్ల ఓర్వకల్లు గ్రామాల్లో ప్రజా పోరు యాత్రను నిర్వహించారు. మండల కార్యదర్శి బి నాగన్న , మండల నాయకులు ఎస్ మధుసూదన్ వి సుధాకర్ వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు రామస్వామి పాల్గొన్నారు. బి నాగన్న మాట్లాడుతూ బైరాపురం గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో వైపు లైను వేసి ఎస్ ఏరియాకు నీళ్ల ఇవ్వడం మరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి నీళ్ళు లేక తీవ్ర ఇబ్బందుల గురవుతున్నారని సుదూర ప్రాంతం వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఇప్పటికైనా ఎస్‌సి కాలనీలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బైరాపురం కృష్ణుడు శేఖర్, శాలిబాష, మాబాష, షఫీ మాసుంబాష తదితరులు పాల్గొన్నారు.

13నమండల సర్వసభ్య సమావేశం: ఎంపిడిఒ

ప్రజాశక్తి -తుగ్గలి

తుగ్గలి మండల మండల సర్వసభ్య సమావేశం ఈనెల 13న నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ విశ్వమోహన్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు ఎర్ర నాగప్ప ఆధ్వర్యంలో నవంబర్ 13న బుధవారం ఉదయం 11:30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. సర్పంచులు,ఎంపిటిసిలు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలన్నారు. అదేవిధంగా మండల స్థాయి అధికారులు తమ నివేదికలతో సమావేశానికి తప్పకుండా హాజరుకావాలన్నారు.

పరిస్కార వేదికకు మూడు వినతులు

ప్రజాశక్తి- సి బెళగల్

తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి సోమవారం ప్రజాసమస్యల పరిస్కార వేదిక నిర్వహించారు.భూమి కొలతలు సరిగ్గా లేవని ఒక రైతు, ఆన్‌లైన్ సమస్యలు పరిష్కరించాలని ఇద్దరు రైతులు వినతి ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే స్పందనను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

బాలయ్యను కలిసిన ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సినీస్టార్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను సోమవారం విజయవాడ అసెంబ్లీలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మర్యాదపూర్వకంగా కలిశారు. అయనను బాలకృష్ణ అభినందించారు.

ఓటరు నమోదుకు 284 దరఖాస్తులు

-ముగిసిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు

-నగరపాలక కమిషనర్, ఆర్వో ఎస్.రవీంద్ర బాబు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నియోజకవర్గంలోని 258 పోలింగ్ కేంద్రాల వద్ద శని, ఆదివారాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలకు 284 దరఖాస్తులు వచ్చినట్లు నగరపాలక కమిషనర్, కర్నూలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.రవీంద్ర బాబు అన్నారు. ఆదివారం కెవిఆర్ కళాశాల, మున్సిపల్ ప్రైమరీ స్కూల్, మున్సిపల్ ఉర్దూ ప్రైమరీ స్కూల్, రోజ స్ట్రీట్ ప్రకాశ్ నగర్ మున్సిపల్ హైస్కూల్, నరసింహా రెడ్డి నగర్, కప్పల్ నగర్, లేబర్ కాలనీ, వెంకటరమణ కాలనీ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ సమ్మరీ రివిజన్-2025 కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని 258 పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు ఏర్పాటు చేయగా, కొత్త ఓటు నమోదుకు సంబంధించి (ఫాం-6) 73, చనిపోయిన, మరో పోలింగ్ కేంద్రానికి ఓటు మార్పు వంటి కారణాలతో ఓటు తొలగింపునకు సంబంధించి (ఫాం-7) 62, పేరు, చిరునామా తదితర వివరాల మార్పునకు సంబంధించి (ఫాం-8) 149 దరఖాస్తులు వచ్చాయన్నారు. కొత్త ఓటు నమోదు, వివరాల మార్పు, తొలగింపు వంటి సేవలకు ఈ నెల 28వ తేదీ వరకు గడువు ఉందని, ఎన్నికల సంఘం వెబ్‌సైట్ లేదా స్థానిక బిఎల్ఒల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎఆర్ఒ, తహశీల్దార్ ఇ.వెంకటలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ డబ్ల్యూ.ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 57వ గ్రంధాలయ వారోత్సవాలు ఈనెల 14 నుండి 20 వరకు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ కార్యదర్శి ప్రకాష్ చెప్పారు. సోమవారం 57వ గ్రంథాలయం వారోత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను కలెక్టర్‌తో కలిసి విడుదల చేశారు. 14వ తేదీ బాలల దినోత్సవం పురస్కరించుకొని ప్రారంభమై 20 వరకు రోజు ఒక కార్యక్రమం చొప్పున ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రంజిత్ బాష, గ్రంథాలయ కార్యదర్శి ప్రకాష్, ఉప గ్రంథ పాలకురాలు వి.పెద్దక్క, గ్రంథాలయాధికారి వజ్రాల గోవిందరెడ్డి, గ్రంథాలయ సిబ్బంది బాష పాల్గొన్నారు.